సాక్షి
పెద్దపల్లి

మంగళవారం ¦ 6 ¦ జూన్ ¦ 2023



రాజన్నకు జనజాతర

వేములవాడ రాజన్న సన్నిధి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఎండలను సైతం లెక్కచేయకుండా భక్తులు తరలివచ్చారు.



అమ్మతనానికి దూరం

కారు రూపంలో వచ్చిన మృత్యువు ఓ గర్భిణిని కబళించింది. భర్తతో కలిసి స్కూటీపై వెళ్తున్న ఆమెను వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
39.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడి గాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

తల్వార్‌తో విద్యుత్ ఎస్ఈ హల్‌చల్



తల్వార్‌తో విద్యుత్‌శాఖ ఎస్ఈ సుదర్శన్

సాక్షి, పెద్దపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పెద్దపల్లి పట్టణంలో విద్యుత్ శాఖ చేపట్టిన ర్యాలీలో ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ బొంకూరి సుదర్శన్ తల్వార్‌తో హల్‌చల్ చేశారు. డీజే సౌండ్స్‌తో సాగుతున్న ర్యాలీలో విద్యుత్ సిబ్బంది ఎస్ఈకి తల్వార్ అందించారు. ఎస్ఈ దానిని గాల్లోకి తిప్పుతూ నృత్యం చేశారు. ర్యాలీలో పెద్దపల్లి ఎమ్మెల్యే, జిల్లా అదనపు కలెక్టరు, పోలీసు సిబ్బంది పక్కనే ఉన్నా నిలువరించలేకపోయారు. ర్యాలీలో పాల్గొన్న స్థానికులు తల్వార్‌తో విన్యాసాలు చేయడంతో భయాందోళనలకు గురయ్యారు. మరోవైపు విద్యుత్ ఉద్యోగుల సభలో మహిళాఇంజినీర్లు 'సారంగ దరియా' పాటకు చిందులేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న జడ్జి ప్రియాంక

సుల్తానాబాద్: పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి జీఎస్ఎల్.ప్రియాంక అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. మానవళి మనుగడకు పర్యావరణం ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూసారపు బాలకిషన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పెగడ శ్యాం సుందర్, ఏపీపీ శ్యాంప్రసాద్, ఏజీపీ మేకల తిరుపతి రెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బీ-థర్మల్‌లో దశాబ్ది వేడుకలు



మొక్క నాటుతున్న ఎస్ఈ విజేందర్

రామగుండం: రాష్ట్ర ఆవిర్భావం అనంతరం విద్యుత్ ఉత్పత్తి రంగంలో ఎంతో ప్రగతి సాధించామని, రాష్ట్ర వ్యాప్తంగా 27.49 లక్షల మంది రైతులకు నిరంతరంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని బీ-థర్మల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్ అన్నారు. విద్యుత్ వేడుకల్లో భాగంగా సోమవారం బీ-థర్మల్‌లో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్‌పీఎఫ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. 2014లో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్లు కాగా 2023 నాటికి 18,567 మెగావాట్లకు చేరిందన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇంజినీర్లు సూర్యనారాయణరెడ్డి, శంకరయ్య, కోలహలం శ్రీనివాస్‌రావు, సత్య శ్రీనివాస్, బాలకృష్ణ, భూమయ్య పాల్గొన్నారు.

అడవులను రక్షించుకోవాలి



మొక్క నాటుతున్న అటవీ శాఖ అధికారి శివయ్య

మంథని: పర్యావరణాన్ని పెంపొందించుకుంటూ.. అడవులను సంరక్షించుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి సిహెచ్.శివయ్య సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంథనిలోని అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో సోమవారం మొక్కలు నాటారు. హరితహారంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. మంథని అటవీ క్షేత్రాధికారి శ్రీనివాసరావు, డీఆర్‌వో రమేశ్, బీట్ అధికారులు శ్రీనివాస్, రామూర్తి, పవన్ కుమార్ పాల్గొన్నారు.



సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి

పరిశుభ్రతకు గుర్తింపు

- జిల్లాకు కాయకల్ప అవార్డుల పంట
- ప్రాథమిక హెల్త్ సెంటర్లలో గర్రెపల్లికి దక్కిన అవకాశం
- సబ్ సెంటర్లలో ధర్మారంలో రెండు, ఎలిగేడులో ఒకటి ఎంపిక

జిల్లా ఆస్పత్రితోపాటు సుల్తానాబాద్ సీహెచ్‌సీకి అవార్డు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిశుభ్రత, పచ్చదనం, రోగులకు అందుతున్న సేవలు, బయోవేస్టేజ్, దవాఖానాలో పరికరాల పరిశుభ్రత, రోగులకు ఇన్‌ఫెక్షన్ రాకుండా చేపడుతున్న చర్యలపై కాయకల్ప బృందం 365 రకాల ప్రశ్నలు వేసి, వివరాలు నమోదు చేసింది. ఇందులో ఉద్యోగులు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సేవలు వంటివి పరిశీలించారు. పెద్దపల్లి ఆస్పత్రి జిల్లా కేంద్ర విభాగంలో కాయకల్ప అవార్డు కైవసం చేసుకుంది. సీహెచ్‌సీ విభాగంలో సుల్తానాబాద్ ఆస్పత్రి, సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ విభాగంలో ధర్మారం మండలంలోని రెండు, ఎలిగేడు మండలంలో ఒకటి అవార్డులు గెలుచుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం జిల్లా, డివిజన్ ఆస్పత్రులకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, వెల్‌నెస్ సెంటర్లు, సబ్ సెంటర్లకు అవార్డులు ప్రకటించింది. 75 శాతం నిధులు ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ తీర్మానం ప్రకారం దవాఖానా అభివృద్ధి కోసం కేటాయించనున్నారు. 25 శాతం మాత్రం సిబ్బందికి ప్రోత్సాహ బహుమతిగా ఇవ్వనున్నారు.

నిత్యం వందల సంఖ్యలో పేషెంట్లు..

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి రోజుకు 400 నుంచి 500 మంది ఇన్ పేషెంట్లు వచ్చి, వైద్య సేవలు పొందుతున్నారని వైద్యులు తెలిపారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి 150 నుంచి 200 మంది వరకు రోగులు వస్తుంటారని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 80 నుంచి 100 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకంతోపాటు బాలింతలకు కేసీఆర్ కిట్ అందిస్తోంది. పాప పుడితే రూ.13 వేలు, బాబు పడితే రూ.12 వేలు ప్రోత్సాహకంగా ఇస్తుండటంతో దవాఖానల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది.

టాయిలెట్ల సౌకర్యం.. సిబ్బంది మర్యాద

ఆస్పత్రులకు వచ్చే రోగులకు టాయిలెట్ల సౌకర్యం, పారిశుద్ధ్య సిబ్బంది వాటిని శుభ్రంగా ఉంచడం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం, రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించడం, తాగునీరు అందుబాటులో ఉంచడం కూడా కాయకల్ప అవార్డు రావడంలో క్రియాశీల పాత్ర పోషించాయని చెప్పవచ్చు.

సుల్తానాబాద్, గర్రెపల్లికి రెండోసారి..

సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి, గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండోసారి కాయకల్ప అవార్డు కైవసం చేసుకున్నాయి. సుల్తానాబాద్ దవాఖానాకు మెరుగైన ర్యాంకు వచ్చినప్పటికీ ప్రోత్సాహ బహుమతి తక్కువ రావడంతో తమ పనితనానికి ఫలితం లేకుండా పోయిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయకల్ప పురస్కారాల్లో గతంలో కంటే భిన్నమైన ఫలితాలు వచ్చాయి. రికార్డుల నిర్వహణ, వైద్య సేవలు, వివిధ విభాగాల నిర్వహణ కొంత లోపభూయిష్టంగా ఉంది. వచ్చే ఏడాది ఆయా విభాగాల్లో మొదటి స్థానం సాధించేలా వైద్యులు, సిబ్బంది దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

జిల్లా ఆస్పత్రికి మూడో స్థానం..

జిల్లా ఆస్పత్రి విభాగంలో పెద్దపల్లి దవాఖానా రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో నిలిచింది. 72.08 శాతం మార్కులు రాగా రూ.3 లక్షలు కేటాయించారు. సుల్తానాబాద్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి 85.9 శాతం మార్కులు రాగా రూ.లక్ష ఇవ్వనున్నారు. ఉత్తమ సబ్ సెంటర్లుగా ధర్మారం మండలంలోని ఖిలావనపర్తి, దొంగతుర్తి, ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్ ఎంపికయ్యాయి.



సేవలు మెరుగుపరుస్తాం

ఈసారి జిల్లా ఆస్పత్రికి ప్రథమ స్థానం దక్కుతుందని భావించాం. గతంలో కంటే మార్కులు పెరగడం తృప్తినిచ్చింది. వచ్చే నిధులను దవాఖానాల అభివృద్ధికి వినియోగిస్తాం. వైద్య సేవలను మెరుగుపరుస్తాం.

– డాక్టర్ రమాదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్, సుల్తానాబాద్

బాధ్యతలు పెంచుతాయి



అవార్డులు బాధ్యత పెంచుతాయి. సమన్వయంతో ముందుకువెళ్లడం వల్లే రెండోసారి కాయకల్ప అవార్డు దక్కింది. రోగులకు నాణ్యమైన సేవలందిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ చంద్రశేఖర్, గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ప్రగతి రన్ నిర్వహిస్తున్న సింగరేణి అధికారులు, నాయకులు

ప్రగతిపథంలో సింగరేణి



ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

గోదావరిఖని: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సింగరేణి అద్భుత ప్రగతి సాధించిందని ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ తెలిపారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జీఎం కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సెక్యూరిటీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ముందుగా ప్రగతి రన్ చేపట్టారు. ఒగ్గుడోలు కళాకారులు, సేవా సమితి మహిళల కోలాటాలు, ఉద్యోగుల నృత్యాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. బొగ్గు ఉత్పత్తి, రవాణా, లాభాలు, టర్నోవర్‌లో సంస్థ గణనీయమైన వృద్ధి సాధించిందన్నారు. ఆర్జీ-1, 3 ఏరియాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డప్పు చప్పుళ్లు, కోలాట బృందాల నృత్యాలు, చిన్నారుల ప్రదర్శనలతో ఉత్సవాలు అంబరాన్నంటాయి. రాష్ట్ర ఏర్పాటుతోనే సింగరేణి ప్రగతి పరుగు సాధ్యమైందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు తెలిపారు. ఆర్జీ-3, ఏపీఏ ఆధ్వర్యంలో రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్నారు. ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్, కార్మిక సంఘాల నాయకులు గౌతం శంకరయ్య, వైవీ.రావు, రవీందర్ రెడ్డి, వేణుగోపాల్‌రావు, కొమురయ్య, సేవా అధ్యక్షురాలు సవిత, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.



స్టేజీపై నృత్యాలు చేస్తున్న యువతులు

నేడు పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు

జ్యోతినగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో గోదావరిఖని ఆర్జీ-1 సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్మికులు, చిన్న, మధ్య తరగతి పారిశ్రామికవేత్తల సమక్షంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ, కేశోరాం సిమెంట్, సింగరేణి, ఇతర పరిశ్రమల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే చందర్, కలెక్టర్ సంగీత

- తెలంగాణ విద్యుత్ విజయోత్సవం దేశానికే ఆదర్శం
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్ సంగీత

జ్యోతినగర్: తెలంగాణ విద్యుత్ విజయోత్సవం దేశానికే ఆదర్శమని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్‌శాఖ అధ్వర్యంలో ఎన్టీపీసీ రామగుండం లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో నిర్వహించిన విద్యుత్ విజయోత్సవ సభలో కలెక్టర్ సంగీతతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యుత్ రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చి రాష్ట్రంలో వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కులవృత్తిదారులకు ప్రభుత్వం అండగా ఉందని, సెలూన్స్‌కు, లాండ్రిషాపులకు 250 యూనిట్లు విద్యుత్ ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో అద్భుతమైన మార్పులను చూస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్ కుమార్, జెడ్పీటీసీలు అముల నారాయణ, కందుల సంధ్యారాణి, కార్పొరేటర్లు, కమిషనర్ సుమన్ రావు, సర్పంచులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని: స్థానిక విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం నుంచి గోదావరి నది సమీపంలోని ఎస్ఎల్‌బీ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడారు. గతంలో కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారని, సీఎం కేసీఆర్ చొరవతో ఇప్పుడు వెలుగులు ప్రసరిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ వెంకటేశ్‌నేత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు సాగునీటి దినోత్సవం



మాట్లాడుతున్న నల్ల వెంకటేశ్వర్లు

జ్యోతినగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు ఇంజినీర్ ఇన్ చీఫ్ నల్ల వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆయన ఈఎన్సీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో, మంథని అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎస్ఎల్‌బీ ఫంక్షన్ హాలులో, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని నందన గార్డెన్స్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి రంగంలో వచ్చిన మార్పులు, సాధించిన ప్రగతి, ప్రాజెక్టులు, చెక్ డ్యామ్‌ల నిర్మాణాలపై వివరించాలని సూచించారు. చెరువుల పండుగలో భాగంగా ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన చెరువుల వద్దకు డప్పుచప్పుళ్లు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారుల వలలతో ఊరేగింపుగా వెళ్లాలని అన్నారు. కట్ట మైసమ్మ, చెరువు నీటికి పూజలు చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈ కరుణాకర్, ఈఈ విష్ణు ప్రసాద్, డీఈఈలు, ఏఈఈలు, నీటి పారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా ఉన్నాం

- ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత
- జిల్లాకేంద్రంలో విద్యుత్ దినోత్సవం



మాట్లాడుతున్న ఎంపీ వెంకటేశ్ నేత

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాకేంద్రంలోని నందన గార్డెన్స్‌లో నిర్వహించిన విద్యుత్ విజయోత్సవంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. విద్యుత్ రంగం సాధించిన విజయాలపై రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అద్భుత ప్రగతి సాధించిందన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్‌తో రైతులు రెండు పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత విద్యుత్ రంగం ఊహకు అందని రీతిలో విజయాలు సాధించిందని దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. గతంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండేదని, రైతులు, పారిశ్రామికవేత్తలు ఇబ్బంది పడేవారని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, రైతులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నీళ్లు, నిధులు, నియామకాల్లో ..

గోదావరిఖని: నీళ్లు, నిధులు, నియామకాల్లో రాష్ట్రం దేశంలోనే అగ్రభాగాన ఉందని ఎంపీ తెలిపారు. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన సింగరేణి ఉత్సవాల్లో పాల్గొన్నారు. వరుస లాభాలతో సంస్థ ముందుకెళ్తోందన్నారు. వారసత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్తోందన్నారు. మెడికల్ కాలేజీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఈ ప్రాంతానికి వచ్చాయన్నారు. కలెక్టర్ సంగీత మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో నడుస్తోందన్నారు. మానికయాదవ్, గౌరి శంకర్ ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. పోటీల విజేతలకు బహుమతులు అందించారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

- హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం
- పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు



సుగ్లాంపల్లిలో పర్యటిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్‌లోని ఒకటోవార్డు సుగ్లాంపల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ – పల్లెపల్లెకూ విజ్ఞన్న నినాదంతో సోమవారం పాదయాత్ర చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నాయని, హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్రం.. రుణమాఫీ చేస్తామన్న రాష్ట్రప్రభుత్వం ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. ధరణితో రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎత్తివేస్తామన్నారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, అంతటి అన్నయ్య గౌడ్, నోముల శ్రీనివాస్‌రెడ్డి, మినుపాల ప్రకాష్‌రావు, దుగ్యాల సంతోష్‌రావు, సాయిరి మహేందర్, గోపగాని సారయ్యగౌడ్, దన్నాయక్ దామోదర్ రావు, చిలుక సతీశ్, సయ్యద్ మస్రత్, పన్నాల రాములు, చింతల రాజు, రాజయ్య, ఎండీ.రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు కన్నీరు పెడుతుంటే సంబురాలా..?

జూలపల్లి: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం సంబరాలు చేసుకుంటోందని విజయరమణరావు విమర్శించారు. మండలంలోని కుమ్మరికుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులతో మాట్లాడారు. నెలరోజులుగా సగానికి పైగా ధాన్యం కేంద్రాల్లో ఉందని, అయినా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న, వరికి పరిహారం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఆయన వెంట నాయకులు మెతుకు కాంతయ్య, కొమ్ము పోచాలు, కనుకుట్ల ఆంజయ్య, ఈర్ల స్వామి, రవిందర్‌రావు, శిరంజన్ సింగ్, తీగెల రాజేశం ఉన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ ఈడీ సునీల్‌కుమార్, అధికారులు



ర్యాలీలో పాల్గొన్న జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్

- జిల్లాలో ఘనంగా పర్యావరణ దినోత్సవం
- ర్యాలీలో పాల్గొన్న జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి హేమంత్‌కుమార్
- గోదావరిఖనిలో హాజరైన జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్



ర్యాలీలో పాల్గొన్న జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు మెరుగైన వాతావరణం అందించేందుకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి పెంచాలని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి డి.హేమంత్ కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పూర్వపుకాలంలో ప్రతి సీజన్ అనుగుణంగా ఉండేదని, ప్రస్తుతం ఎండాకాలంలో సైతం అకాలవర్షాలు కురుస్తున్నాయని, వెంటనే మళ్లీ తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వలన ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మనిషి తన స్వార్థం కోసం వనరులను అధిక మొత్తంలో ఒకేసారి తీసుకోవడం ద్వారా అనర్థాలు తలెత్తుతున్నాయని అభిప్రాయపడ్డారు. పూర్వం పంచభూతాలను పూజించేవారమని, వాటి సంరక్షణ కోసం ప్రస్తుతం ప్రతిఒక్కరు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. చెట్లను విరివిగా పెంచడం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ర్యాలీ అనంతరం మొక్కలను నాటారు. పరిపాలన అధికారి మహమ్మద్ రఫీ ఉదిన్, జనరల్ సెక్రెటరీ రెడ్డి శంకర్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీనివాస్, న్యాయవాదులు సత్తయ్య, మార కిశోర్, హనుమాన్ సింగ్, కుమారస్వామి, శ్రీధర్, రమేశ్, నరేశ్, సంతోష్, బాబ్జి, సత్యనారాయణ, అటవీశాఖ సెక్షన్ అధికారి మంగిలాల్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో..

గోదావరిఖని టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు సహకరించాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాస్ రావు అన్నారు. గోదావరిఖని అదనపు జిల్లా న్యాయస్థానంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి రాజేందర్, గణేష్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు చక్రపాణి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో..

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన ర్యాలీని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణకు ఎన్టీపీసీ సంస్థ కట్టుబడి ఉందన్నారు. మొక్కలను పెంచి పర్యావరణాన్ని రక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్, పర్యావరణ అధికారి భిక్షపతి, ఉన్నతాధికారులు, విద్యార్థులు, సీఐఎస్ఎఫ్ అధికారులు, వివిధ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ధాత్రివేదన'కు జాతీయ బహుమతి



రాకుమార

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన కవి రాకుమార రాసిన ధాత్రివేదన కవిత జాతీయస్థాయి బహుమతికి ఎంపికైంది. హైదరాబాద్‌లోని సాహితీ కిరణం 14వ వార్షికోత్సవం సందర్భంగా నేమాన సుబ్రమణ్య శాస్త్రి స్మారక జాతీయస్థాయి కవితల పోటీలను గత నెల నిర్వహించింది. ఈ పోటీలకు రాకుమార తన కవితను పంపించారు. ఈ నెల 15న హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఆయనకు బహుమతిని ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకుడు పొత్తూరి సుబ్బారావు తెలిపారు. రాకుమార ఇప్పటివరకు నిర్వహించిన రాష్ట్ర, జాతీయస్థాయి వచన, గేయ, పద్య కవితల పోటీల్లో 65 బహుమతులు సాధించారు.

ఇటుకబట్టీలపై విచారణకు లోకాయుక్త ఆదేశం?

పెద్దపల్లిరూరల్: పర్యావరణానికి హాని కలిగిస్తూ జన జీవనాన్ని అతలాకుతలం చేస్తూ ఇటుకబట్టీల మాఫియా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని పెద్దపల్లి మండలంలోని రంగాపూర్‌కు చెందిన బాలసాని వెంకటేశం 2021లో లోకాయుక్తను ఆశ్రయించారు. దీనిపై లోతైన విచారణ చేపట్టేందుకు ఆదేశాలివ్వగా సోమవారం అధికారులు రంగంలోకి దిగినట్లు సమాచారం. రెండేళ్లుగా ఫిర్యాదుపై సంబంధిత అధికారులు ఇచ్చిన వివరణలను పరిశీలిస్తూ వాయిదాలు వేస్తూ వచ్చింది. రెవెన్యూ, మైనింగ్, పొల్యూషన్, ఇండస్ట్రియల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఇచ్చిన వివరణలపై అభ్యంతరం వ్యక్తం చేసిన లోకాయుక్త నేరుగా పరిశీలించి, విచారణ చేపట్టి, రిపోర్ట్ ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

గోదావరినదిలో మొసలి పిల్ల ప్రత్యక్షం



నదిలో నీరు తగ్గి, కనిపిస్తున్న ఇసుక

రామగుండం: గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో అంతర్గాం-మంచిర్యాల మధ్య ఉన్న గోదావరినదిలో వరద నీటి మట్టం తగ్గిపోయి, ఇసుక తిన్నెలు దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం నది మధ్యలో ఇసుక తిన్నెలపై ఉన్న గడ్డి పొదల్లో మొసలి పిల్ల కనిపించిందని కొంతమంది తెలిపారు. పెద్ద మొసలి కూడా ఇదే ప్రాంతంలో ఉంటుందని అనుమానిస్తున్నారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద జాలర్లు మొసలిని గుర్తించిన విషయం తెలిసిందే. పుణ్యస్నానాల నిమిత్తం గోదావరి నదికి వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

సుదర్శన్ మృతి తీరనిలోటు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ (ఆనంద్) మృతి తీరని లోటు అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ నాయకులు కె.రాజన్న, ఐ.క్రిష్ణ, ఇ.నరేష్, చిలుక శంకర్ అన్నారు. సింగరేణి కార్మిక కుటుంబం నుంచి నాయకుడిగా ఎదిగి, విప్లవోద్యమానికి అంకితమై చివరి శ్వాసవరకూ పనిచేశారని తెలిపారు. ఐదు దశాబ్దాలు దండకారణ్యంలో ఆజ్ఞాత వీరుడిగా నిలిచారన్నారు. నమ్ముకున్న రాజకీయాల కోసం చివరి దాకా నిలబడ్డారని కొనియాడారు.

అన్నను చంపిన తమ్ముడు

బుగ్గారం(ధర్మపురి): నిద్రిస్తున్న అన్నపై రోకలి బండతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన బుగ్గారం మండలం చిన్నాపూర్‌లో ఆది వారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇడగొట్టు తిరుపతి (45), ఇడగొట్టు శ్రీనివాస్ అన్నదమ్ములు. కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. 2015లో తిరుపతి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదైంది. దీంతో కేసుపై రాజీకి రావాలని శ్రీనివాస్ తిరుపతిని కోరాడు. అందుకు తిరుపతి నిరాకరించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవలు మరింత ముదిరాయి. ఆదివారం తిరుపతి తన ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో శ్రీనివాస్ రోకలి బండతో అన్నపై దాడిచేశాడు. దీంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

క్షణాల్లో ఘోరం..అమ్మతనానికి దూరం

- ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లి వస్తుండగా ప్రమాదం
- స్కూటీని వెనుక నుంచి ఢీకొన్న కారు
- తీవ్రంగా గాయపడి, భర్త చేతిలోనే ప్రాణాలు వదిలిన గర్భిణి
- ఎన్టీపీసీ క్రషర్‌నగర్ వద్ద ఘటన



భర్త క్రాంతితో నిహారిక (ఫైల్)





భార్యను కాపాడుకునేందుకు భర్త ఆరాటం, ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



బాధితులను పరామర్శిస్తున్న మక్కాన్‌సింగ్

జ్యోతినగర్(రామగుండం): మాటలకందని విషాదం .. మరికొన్ని రోజుల్లో ప్రసవం జరిగి, ఆ ఇంట్లోకి శిశువు రానుందన్న వారి ఆనందాన్ని రోడ్డు ప్రమాదం క్షణాల్లో తీసుకెళ్లిపోయింది. కారు రూపంలో వచ్చిన మృత్యువు ఓ గర్భిణిని కబళించింది. భర్తతో కలిసి స్కూటీపై వెళ్తున్న ఆమెను వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గర్భిణి తీవ్రంగా గాయపడి, మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన నిహారిక, రామగుండం మండలంలోని మల్యాలపల్లెకు చెందిన కత్తెరమల్ల క్రాంతి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆమె ఓ మెగా మార్కెట్‌లో పని చేస్తోంది. ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భిణి. ఆధార్ అప్‌డేట్ కోసం భర్తతో సోమవారం స్కూటీపై ఎన్టీపీసీ రామగుండం వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్తుండగా క్రషర్‌నగర్ రాజీవ్ రహదారిపై పెద్దపల్లి వైపు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నిహారికను గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కడుపులో ఉన్న శిశువు కళ్లు తెరవకుండానే ప్రాణాలు విడిచింది. కొన్ని నిమిషాల్లో ఇంటికి చేరేవారని, ఈలోగా ఇంత ఘోరం జరిగిందంటూ మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రిలో కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వెళ్లి, మృతురాలి భర్త నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ..

పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్ మక్కాన్ సింగ్ గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో నిహారిక మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట నాయకులు ఫకృద్దీన్, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, రామగుండం పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శిరిషెట్టి సతీశ్, మద్ది తిరుపతి గౌడ్, బరుపాటి శ్రీనివాస్ తదితరులున్నారు.

గుడ్డ సంచులనే వినియోగించాలి

- ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి
- ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్



గుడ్డ సంచులు అందిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): పర్యావరణ పరిరక్షణకు గుడ్డ సంచులను ఎక్కువగా వినియోగించాలని ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. సోమవారం గోదావరిఖనిలోని తన కార్యాలయం ఆవరణలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, కార్మికులకు గుడ్డ సంచులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లు పెరగకపోతే సరైన ఆక్సిజన్‌ను పొందలేమని తెలిపారు. సకాలంలో వర్షాలు కురవకపోతే నీటి కష్టాలు వస్తాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు సింగరేణి యాజమాన్యం ఏటా లక్షలాది మొక్కలు నాటిస్తోందని తెలిపారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు సవిత, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం సలీం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల్లో పనులు వద్దు



నిరసన తెలుపుతున్న రైతులు

- మంథని-ఖమ్మంపల్లి ప్రధాన రహదారిపై రైతుల నిరసన

మంథని: తమ వ్యవసాయ భూముల్లో ఎస్సారెస్పీ అధికారులు పనులు చేయిస్తున్నారని ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి, సీతంపేట, రంగయ్యపల్లి, శుక్రవారంపల్లి గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మంథని-ఖమ్మంపల్లి ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. రోడ్డుపై బైఠాయించి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటున్న భూముల్లో కెనాల్ పక్కన 110 ఫీట్ల భూమి అంటూ హద్దులు వేస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి, న్యాయం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు అందుకున్న విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న మాస్టర్ శ్రీనివాస్, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు

గోదావరిఖని టౌన్(రామగుండం): రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2023 పోటీల్లో గోదావరిఖని విద్యార్థులు ప్రతిభ కనబరిచి, గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించారు. ఈ నెల 4న కరీంనగర్‌లో నిర్వహించిన పోటీల్లో 500 మంది పాల్గొన్నారు. వీరిలో గోదావరిఖనికి చెందిన ఓకినావా రెడ్ డ్రాగన్ కరాటే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ఓవరాల్ టీం కప్‌తోపాటు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు గెలుచుకున్నారు. ఈ.వర్షిత్ బ్లాక్ బెల్ట్ కుమిటీ విభాగంలో సిల్వర్ మెడల్, డి.నిత్యం ఆరెంజ్ బెల్ట్ కుమిటీ విభాగంలో గోల్డ్ మెడల్, కటా విభాగంలో సిల్వర్, దివ్య బ్లూబెల్ట్ కుమిటీ విభాగంలో గోల్డ్ మెడల్, హరిహారం వైట్ బెల్ట్ కుమిటీ విభాగంలో గోల్డ్ మెడల్, అన్వేష్ గ్రీన్ బెల్ట్ కుమిటీ విభాగంలో గోల్డ్ మెడల్, హేమంత్ కుమార్ ఆరెంజ్ బెల్ట్ కటా విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా వీరిని రెడ్ డ్రాగన్ కరాటే ఇన్‌స్టిట్యూట్ సిహాన్ కె.మొండయ్య, సీనియర్ కోచ్ క్రాంతికుమార్, విశ్వభారతి చైర్మన్ యాదగిరి గౌడ్ తదితరులు సోమవారం అభినందించారు.

ఎన్టీపీసీ విద్యార్థులు..

జ్యోతినగర్(రామగుండం): కరీంనగర్‌లో నిర్వహించిన తెలంగాణ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2023లో గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను ఎన్టీపీసీ రామగుండంకు చెందిన అమృత సాధించింది. జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు పలు పతకాలు గెలుచుకున్నారు. వారిని కరాటే కోచ్ శ్రీనివాస్, జపాన్ షిటోరియా కరాటే స్కూల్ ప్రెసిడెంట్ ఎం.రమేశ్, ఎన్టీపీసీ రామగుండం స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బాణేశ్‌రావు, స్పందన క్లబ్ సెక్రటరీ త్రివేది, చిరంజీవి ఆదిత్య, వంశీకృష్ణ సోమవారం అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నిక జరపండి

- కేశోరాం కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య



కేశోరాం ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం వర్కర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నిక జరపాలని కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య కేశోరాం సిమెంట్ ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఇటీవల పర్మినెంట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో క్లబ్ సెక్రటరీగా పోతుల ప్రసాద్ అనే కార్మికుడిని నియమించి, ప్రమాణస్వీకారం చేయించారు. అయితే పర్మినెంట్ యూనియన్ నాయకులు కార్మిక హక్కులను కాలరాసేలా వ్యవహరించారని, గతంలో వర్కర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పదవికి చట్టబద్ధంగా ఎన్నికలు నిర్వహించేవారని సమ్మయ్య తెలిపారు. ప్రస్తుతం కూడా అలాగే జరపాలని కోరారు. ఈ మేరకు కార్మికుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్య, నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్, తిరుపతిరావు, రాజేశం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఓదెల: మండలంలోని కొలనూర్, గోపరపల్లె, ఓదెల, లంబాడితండా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిపనులను ఎంపీడీవో జి.సత్తయ్య పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ని ఎస్సారెస్పీ ఉపకాల్వ ల్లో చేపడుతున్న పూడిక పనులు పర్యవేక్షించారు. జాబ్‌కార్డులు దరఖాస్తు చేసుకవాలన్నారు.

రేషన్ సరుకులు ఆలస్యం..

- సమ్మె చేస్తున్న డీలర్లు
- సరుకుల పంపిణీపై ప్రభావం
- జిల్లాలో 413 రేషన్ షాపులు



సుల్తానాబాద్: ఈనెల రేషన్ సరుకుల పంపిణీ ఆలస్యమయేల్యా కనిపిస్తోంది. తమ సమస్యలు పరిష్కరించాలని, గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రేషన్ డీలర్లు ఈనెల 3 నుంచి సమ్మెలోకి వెళ్లిన విషయం తెల్సిందే. వాస్తవానికి ప్రతినెలా 30 బియ్యంకు సంబంధించిన ఇండెంట్ తీసుకుని ఐదో తేదీ నుంచి సరఫరా ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే తమ సమస్యలు పరిష్కరించాలని, గౌరవ వేతనం, కమీషన్ పెంచాలని, లేకుంటే సమ్మెకు వెళ్తామని డీలర్లు మే 19నే జిల్లా అదనపు కలెక్టర్‌కు నోటీస్ ఇచ్చారు. దీనికి ఆయన సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటించినా అమలు చేయకపోవడంతో సమ్మెలోకి వెళ్లినట్టు డీలర్లు చెప్పన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 413 రేషన్ షాపుల డీలర్లు ఆకస్మికంగా సమ్మెకు వెళ్లడంతో ఆ ప్రభావం సరుకుల పంపిణీపై పడనుంది. షాపులు తెరుచుకోకపోవడంతో లబ్ధిదారులు దుకాణాల వద్దకు రావడం.. విషయం తెలుసుకుని వెనుదిరగడం వంతవుతోంది.

సమస్యలు పరిష్కారం కాకపోవడంతో..

గౌరవ వేతనం కావాలని డీలర్లు ఏళ్లతరబడి పోరాటం చేశారు. డీలర్లకు రూ.10 లక్షల బీమా కల్పించాలని, హమాలీ చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలని, మండలస్థాయి స్టాక్ పాయింట్లలో వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని, శాశ్వత అథరైజేషన్ ఇవ్వాలని, కారుణ్య నియామకాలు 50 ఏళ్లకు పెంచాలని ఇలా 21 సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దీనికి స్పందించి మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. అయినా పరిష్కరించకపోవడంతో సమ్మెబాటను ఎంచుకున్నారు.

గౌరవ వేతనం ఇవ్వాలి

రేషన్ డీలర్లకు వేతనం ఇవ్వాలి. గౌరవ వేతనం ఇస్తామని సీఎం కేసీఆర్ అనేక సభల్లో ప్రకటించారు. తొమ్మిదేళ్ల అవుతున్నా ఆ హామీ నెరవేరలేదు. ప్రజలకు అసౌకర్యం కలిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

– కొమురయ్య గౌడ్, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం, సుల్తానాబాద్

డీలర్లతో చర్చలు జరపాలి

రేషన్ డీలర్లతో ప్రభుత్వం చర్చలు జరపాలి. రేషన్ బియ్యం తీసుకునేవారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే అధికంగా ఉన్నారు. ప్రభుత్వం వారిని పస్తులు ఉండకుండా చేయాల్సిన బాధ్యత ఉంది. డీలర్ల సమస్యలకు పరిష్కారం చూపాలి.

– రాజేందర్, ఎమ్మార్పీఎస్, జిల్లా అధ్యక్షుడు

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786393]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221311]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824